క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ



పి.నాయకంపల్లిలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చంటిబాబు

గండేపల్లి: పి.నాయకంపల్లిలోని పురాతన రామాలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వేడుకగా జరిగింది. స్థానిక ఎస్ఆర్ స్కూల్ యాజమాన్యం కాకర్ల రామకృష్ణ, భార్గవి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ స్వామివారిని దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కె.నాయకంపల్లి, యల్లమిల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఉచిత వైద్య శిబిరం

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, మండల కన్వీనర్ పెంటకోట మోహన్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి వైద్యుడు వరప్రసాద్ రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి జనరల్ మేనేజర్ క్రాంతి కుమార్, మేనేజర్ శివప్రసాద్, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లల రామకృష్ణ, సహాయ కార్యదర్శి దాసం శేషారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



రంపయర్రంపాలెంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు

గోకవరం: పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ సూచించారు. మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో మంచి ఫలితాల్లో సాధించాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, ఎంఈఓ బి.గౌరమ్మ, పీఎంసీ చైర్మన్ గుప్త, హెచ్ఎం ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన దేవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తుని: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం నూకరత్నం బుధవారం తెలిపారు. గత నెల 27 నుంచి 31 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో తుని మండలం ఎన్.చామవరానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎస్.దేవి ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. త్వరలో జమ్ము కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో దేవి పాల్గొంటుందని చెప్పారు. ప్రతిభ చూపిన దేవిని జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, పీడీలు హరిమాలిని, లోవలక్ష్మి, ఉపాధ్యాయులు కిశోర్, శివకుమార్ అభినందించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోటలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆచారం ప్రకారం గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణులు అనకాపల్లి జిల్లా నాతవరం మండలం గన్నవరం నుంచి బ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని భారీ ఊరేగింపుగా భీమవరపుకోట తీసుకొచ్చి ప్రత్యేక మండపంపై ప్రతిష్ఠించారు. ఐదు రోజుల పాటు దీప, ధూప, నైవేద్యాలతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి చిత్రపటాన్ని అంగరంగ వైభవంగా నిమజ్జనం చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సంక్షేమ పథకాలతో సరికొత్త అధ్యాయం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- తోటపల్లి, వెంకటనగరం గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం



వెంకటనగరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని తోటపల్లి, వెంకటనగరం గ్రామాల్లో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ మేడసాని సింహాద్రి, వైఎస్సార్ సీపీ నాయకులు బాబీ, కోరాపు గంగరాజులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత మూడున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అనంతరం తోటపల్లిలో రూ.15 లక్షలతో పది వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఏపీఎం వెంకట్, వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, పార్టీ మండల మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచ్‌లు రొంగల నాగేశ్వరరావు, నడిగట్ల త్రిమూర్తులు, తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎస్వీ చలం తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఏలేశ్వరంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి, లబ్ధిదారులు

ఏలేశ్వరం: ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమం చేపట్టి బుధవారం నాటికి రెండేళ్లు పూర్తయింది. దీంతో పట్టణంలో రేషన్ లబ్ధిదారులు, రేషన్ పంపిణీ వాహనదారులు మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సత్యవతి మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికి ఇంటికి రేషన్ సరుకులు ఇచ్చేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీ విజయవంతమైందన్నారు. అధికారం చేపట్టిన మూడేళ్లలోనే సుమారు 95 శాతం ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ ప్రతిఒక్కరూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, కొనాల వెంకటరమణ, ఏడీపీ ప్రసాద్, జామి ఆదినారాయణ, పైల శ్రీధర్, వాహనదారులు పిన్నింటి శ్రీనివాసు, చీమల శ్రీను, మిరియాల రమేష్, గుడాల చందు, కొప్పిశెట్టి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో మేనేజ్‌మెంట్ ఫెస్ట్–2023



మేనేజ్‌మెంట్ ఫెస్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న గ్లోబల్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ సుగుణారెడ్డి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ఈ నెల 3, 4 తేదీల్లో మేనేజ్‌మెంట్ ఫెస్ట్–2023 నిర్వహించనున్నట్టు స్కూల్ డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి బుధవారం తెలిపారు. శుక్ర, శనివారం రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు తమ కళాశాలల నుంచి నేరుగా పేర్లు రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు మార్కెటింగ్, ఫైనాన్స్, మానవ వనరులు, ఐటీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. వీడీఎం వ్యవస్థాపక అధ్యక్షులు అజిత్ కుమార్, రాక్ సెరామిక్స్ కంపెనీ హెడ్, హెచ్ఆర్ టి.నీరజ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ తెలిపారు. ఈ జాతీయ స్థాయి ఈవెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. అనంతరం మేనేజ్‌మెంట్ ఫెస్ట్–2023 పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్



ప్రత్తిపాడు ఇందిరా కాలనీలో వృద్ధుడికి పింఛను అందిస్తున్న వలంటీర్, సచివాలయ కన్వీనర్



ఏలేశ్వరంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్, నాయకులు



కిర్లంపూడిలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వలంటీర్ ఉమామహేశ్వరావు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. తెలవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు సొమ్ము అందజేశారు. మండలంలోని 90 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. వలంటీర్లు ఇంటికే తెచ్చి పింఛన్ల సొమ్ము అందజేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్తిపాడు: వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు బుధవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజు 75 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో 11,846 మంది పింఛనుదారులుండగా సాయంత్రం 5 గంటలకు 8,885 మందికి వలంటీర్లు పింఛన్లు బట్వాడా చేసినట్టు ఎంపీడీఓ ఎస్. వెంకటాచలం తెలిపారు.


కిర్లంపూడి: మండలవ్యాప్తగంగా బుధవారం తొలిరోజు 80 శాతం ఫించన్లు పంపిణీ చేశారు. మండలంలో 26 గ్రామ సచివాలయాల పరిధిలో 11306 మంది పింఛనుదారులుండగా సాయంత్రం 5 గంటలకు 80 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు తెలిపారు.

పాఠశాలలో చెట్ల నరికివేతపై ఆందోళన

రౌతులపూడి: బలరామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏళ్ల కాలంగా ఉన్న వివిధ మారుజాతి చెట్లను అక్రమంగా నరికి తరలించడంపై గ్రామానికి చెందిన జైభీమ్ యువకులు బుధవారం ఆందోళన చేపట్టారు. స్కూల్ ఆవరణలో వివిధ రకాల సుమారు 20 చెట్లను పాఠశాల హెచ్ఎం, మరికొందరు కలిసి నరికివేసి అమ్ముకున్నట్టు ఆరోపించారు. దీనిపై పాఠశాల హెచ్ఎం రామకృష్ణను వివరణ కోరగా పాఠశాలకు సెలవు దినంలో ఎవరో చెట్లను నరికి వేశారని, ఈ విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. కాగా దీనిపై హెచ్ఎం పోలీసులకు ఫిర్యాదు చేయకపోవటం కొసమెరుపు.

కాసులకు కక్కుర్తి

- పత్తిపాడు ఎస్ఈబీ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
- బయటకు వచ్చిన కాల్ రికార్డింగ్
- విచారణ చేపట్టిన అధికారులు



ప్రత్తిపాడులోని ఎస్ఈబీ స్టేషన్

ప్రత్తిపాడు రూరల్: కంచే చేను మేసినట్టుగా తయారైంది ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ పరిస్థితి. అవినీతిని నిర్మూలించాల్సిన అధికారులే దానిని ప్రోత్సహించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కట్టుదిట్టంగా సారా నిర్మూలనకు చర్యలు చేపడుతుంటే ఎస్ఈబీ అధికారులు మాత్రం అక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. అక్రమ మద్యం, సారా, గంజాయి, గుట్కా నియంత్రణకు గాను ప్రభుత్వం నూతన మద్యం పాలసీ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పలు కీలక చర్యలు తీసుకుంది. సారా, గంజాయి, గుట్కా వంటి మాదకద్రవ్యాలను అరికట్టే విధంగా పలు నిబంధనలను తీసుకువచ్చి వాటిన అమలు చేసే బాధ్యతను ఎస్ఈబీ అధికారులకు అప్పగించింది. దానికి పూర్తి విరుద్ధంగా ప్రత్తిపాడు ఎస్ఈబీ సర్కిల్ పోలీసు స్టేషన్‌పరిధిలో అవినీతి రాజ్యమేలుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దానిని బలపరుస్తూ తాజాగా ఎస్ఈబీ ఎస్సై ప్రసాద్ నిందుతుడి నుంచి సొమ్ములు డిమాండ్ చేస్తున్న ఫోన్ సంభాషణ ఒక్కటి బయటకు వచ్చింది. ఇటీవల ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెంలో సారా విక్రయాలపై అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పది లీటర్ల సారాతో ఓ మహిళను పట్టుకున్నారు. పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసేందుకు నిందుతురాలిగా ఆమె పేరును చేర్చారు. ఆ కేసు నుంచి ఆమె పేరును తొలగించేందుకు రూ.4 వేలు, కోవిడ్ పరీక్ష నిమిత్తం రూ.1000 ఇవ్వాలంటూ ఎస్ఈబీ ఎస్సై ప్రసాద్ డిమాండ్ చేస్తున్న ఫోన్ సంభాషణ బయటకు వచ్చింది. సంబంధిత అధికారులు డబ్బులు తీసుకుని రికార్డుల్లో ఆమె పేరును తొలగించి ఆమె భర్త పేరును చేర్చినట్టు తెలిసింది. దీనిపై ప్రత్తిపాడు ఎస్ఈబీ సీఐ అశోక్‌ను వివరణ కోరగా ఎస్సైపై వచ్చిన అవినీతి ఆరోపణలపై శాఖాపరమైన విచారణ చేపట్టినట్టు తెలిపారు.

బీసీల పక్షపాతి సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత చలమయ్య

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య అన్నారు. స్థానిక దిబ్బలపాలెంలోని దాకమర్రి లోవరాజు కమ్యూనిటీ భవనంలో బుధవారం రజకులు, విశ్వబ్రహ్మణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ సీఎంజగన్ పాలనలో బీసీలకు న్యాయం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో బీసీల్లో ప్రతికులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా సీఎం జగన్‌కే పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు సుంకర రాంబాబు, దిలబర్ హుస్సేన్, తొండారపు రాంబాబు, అంజూరి రాజారావు, దాకమర్రి లోవరాజు, అలమండ వీరరాఘవస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి మంత్రి రాజా విరాళం



విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: స్థానిక హౌరా బ్రిడ్జి సెంటర్ వద్ద సంపత్ వినాయక ఆలయ నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా రూ.5 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు పార్టీ నాయకులతో కలిసి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పార్టీ నాయకులు నాగం గంగబాబు, గాబు రాజు, రౌతు శివ, తొండంగి ఉప సర్పంచ్ కందా బాబ్జీ పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

తొండంగి: మండలంలోని ఒంటిమామిడిలో రూ.15 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు బుధవారం భూమి పూజ చేశారు. ఎంపీడీఓ పసపులేటి సతీష్, వైఎస్సార్ సీపీ నాయకుడు గాబు రాజు, పంచాయతీ సర్పంచ్ అంగుళూరి సుధాకర్, ఉప సర్పంచ్ గోసల కిషోర్, పంచాయతీ కార్యదర్శి చోడిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

తుని: ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో బుధవారం సాయంత్రం కౌన్సిలర్ కోలా శ్రీను ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

జగ్గంపేట: గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..జగ్గంపేట శివారు పంట పొలాల్లో పేకాట ఆడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3980 స్వాధీనం చేసుకున్నారు.

నేడు గోకవరంలో గడపగడపకూ..

గోకవరం: గ్రామంలో గురువారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీపీ సుంకర శ్రీవల్లి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిత్యావసరాల పంపిణీ

శంఖవరం: కొంతంగిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి బుధవారం బీసీ నేతలు నిత్యావసరాలు పంపిణీ చేశారు. బాధితుడు గుమ్మిడి శ్రీను కుటుంబానికి బియ్యం, దుస్తులు దుప్పట్లు, నిత్యావసరాలు అందజేశారు. అలాగే కేన్సర్‌తో బాధపడుతున్న ఒమ్మి కొండబాబును ఓదార్చి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గొంప శివకుమార్, గింజాల తలుపులబ్బాయి, బత్తుల శివకుమార్, కట్టమూరి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పాండవుల తీర్థం ప్రారంభం

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో పాండవుల మెట్ట వద్ద బుధవారం పాండవుల తీర్థం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి కొండపైన గుహల్లో ఉన్న పాండవులు, ద్రౌపతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపై పాలు పొంగించి నైవేద్యాలు సిద్ధం చేసి పాండువులకు నివేదించారు. కొండ దిగువన ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలకు అదనపు రుణం

తుని రూరల్: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు గాను ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అదనపు రుణాన్ని అందిస్తోందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వై.సత్తిబాబు తెలిపారు. బుధవారం తుని మండలం టి.తిమ్మాపురంలో రుణాలకు అర్హులైన లబ్ధిదారులతో ఏపీఎం సమావేశమయ్యారు.క్షేత్రస్థాయిలో పర్యటించి ఇళ్ల నిర్మాణ పనులు ఎంత మేరకు జరిగాయి, లబ్ధిదారుల్లో డ్వాక్రా సంఘాల్లో సభ్యులకు అదనపు రుణం మంజూరుపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఏపీఎం సత్తిబాబు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు రుణాలు మంజూరుకు ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించిందన్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు తుని మండలంలో 367 మందికి అదనపు రుణాలను మంజూరు చేస్తామన్నారు. జనవరిలో 131, ఫిబ్రవరిలో 129, మార్చిలో 107 మందికి రుణాన్ని ఇవ్వనున్నట్టు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.35 వేల నుంచి రూ.50 వేలు వరకు రుణాన్ని అందిస్తామన్నారు. ఇళ్ల లబ్ధిదారులు అదనపు రుణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



అల్లిపూడిలో మత్సకారులకు ద్విచక్ర వాహనాలు పంపిణీ చేస్తున్న నేతలు

కోటనందూరు: మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ చింతకాయల చినబాబు అన్నారు. మండలంలోని అల్లిపూడిలో మత్స్యకార సంఘాల్లో ఆరుగురి సభ్యులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంవై) పథకం ద్వారా మంజూరైన టీవీఎస్ మోపెడ్ ద్విచక్రవాహనాలు, ఐస్ బాక్స్‌లను బుధవారం లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావులతో కలిసి పంపిణీ చేశారు. సర్పంచులు తరిపే చినతల్లి, తుమ్మల రాణి, మత్సశాఖ అధికారి అన్నవరం, మత్స శాఖ సహాయకులు ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- కన్నులపండువగా స్వామివారి కల్యాణాలు
- పలు గ్రామాల్లో అన్నదానం



గోకవరంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు



ఏలేశ్వరంలో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో నిత్యహోమం



రాజుపాలెం సీతారామాంజనేయ ఆలయంలో ఏకాహం నిర్వహిస్తున్న మహిళా భక్తులు



రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



ఎస్.అన్నవరంలో అఖండ విష్ణు సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు, విద్యార్థులు

తునిరూరల్/ఏలేశ్వరం/కోటనందూరు/కిర్లంపూడి/రౌతులపూడి/శంఖవరం/గండేపల్లి/జగ్గంపేట/గోకవరం/తొండంగి/ప్రత్తిపాడు/అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహిళలు, విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అఖండ విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేదవిద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఏలేశ్వరం సత్యనారాయణస్వామి ఆలయంలో విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో మహిళలు పారాయణ చేసి భక్తిగీతాలు చేశారు. దిబ్బలపాలెంలోని కోదండ రామాలయంలో ఏకాహం నిర్వహించారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం సీతారామాంజనేయ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో ఆలయాల్లో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ప్రత్యేక పూజలు చేశారు. మల్లేపల్లిలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం కన్నులపండువగా జరిగింది. ప్రత్తిపాడులోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. గోకవరం మండలం తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, పోస్టల్ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద స్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయం వద్ద స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది తొండంగి మండలంలోని ఏవీ నగరంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం కన్నులపండువగా జరిగింది.

రత్నగిరి...భక్తజనఝురి

రత్నగిరి సత్యదేవుని సన్నిధి భీష్మ ఏకాదశి సందర్భంగా తరలివచ్చిన వేలాది మంది భక్తులతో బుధవారం కిట కిటలాడింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. వేలాది మంది భక్తులకు సర్క్యులర్ మండపంలో పులిహోర, దద్ధోజనం పంపిణీ చేశారు. చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు. పశ్చిమ రాజగోపురం వద్దకు వెళ్లే రోడ్డుకు మరమ్మత్తులు చేసి భక్తులను అనుమతించడంతో వేలాది మంది భక్తులు ఆ రోడ్డు మీదుగా స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ఉదయం ఏడు గంటలకు 108 స్వర్ణపుష్పాలతో పూజలు చేశారు.